# ముప్పదిమూడవ ప్రసంగము

శ్రీప్రకాశానందస్వామివారు ఒకప్పుడు జేతపురము వెళ్ళిరి. అచ్చటినుండి వారిని వీరపురము తీసికొనివెళ్ళుటకు జగ్‌జీవనభాయి వచ్చియుండెను. స్వామివారు చెప్పిరి:- పీఠడియాగుండా వెళ్ళెదము. అచ్చట శ్రీనిత్యానందస్వామివారితో కలసి వీరపురము వచ్చెదము. తరువాత అక్కడినుండి డా. లల్లుభాయి, మాష్టరు ప్రభాశంకరభాయి, కాళాభాయి మొదలగువారు నాలుగుగంటలకు పీఠడియా వచ్చి కలసికొనిరి. శ్రీనిత్యానందస్వామివారు శ్రీప్రకాశానంద స్వామివారిని ప్రశ్నించిరి:—

"తమశరీరము ఆరోగ్యవంతముగా నున్నదా?"

స్వా. ప్ర. — సుజ్ఞః పృచ్ఛతి సద్వార్తాం శరీరే కుశలం తవ।
కుతః కుశలమస్మాకం ఆయుర్యాతి దినే దినే॥

"విజ్ఞుడు కుశలమా అని అడుగును. కాని రోజురోజుకు ఆయుర్దాయము తగ్గిపోవువానికి కుశలము ఎక్కడ?"

తరువాత శ్రీనిత్యానందస్వామివారు ఎల్లరికుశలమును అడిగి కాళాభాయితో నిట్లనిరి:- ఇంత వార్ధక్యమునకూడ దుకాణముపై కూర్చొనెదరని నేను వింటిని అది నిజమా?

కాళా:— ఏమి చేయుదును? పిల్లలు నన్నువదలలేదు. అందుచే కూర్చొనవలసివచ్చును.

స్వా. ప్ర. :— ఈయన మనుమనికి నౌకరీచేయుచున్నాడు. కాళాభాయీ! అతడు మీకు ఎంత జీతము ఇచ్చును?

కాళా:— తినుటకు భోజనము పెట్టును. అదియే జీతము.

స్వా. ప్ర. :— మీరు వ్యాపారములో అబద్ధమాడుట మానవనిరా?

కాళా:— అబద్ధమాడుట నేను మానివేసితిని.

స్వా. ప్రి:— అచ్చే! మీరు అట్లుచెప్పిన నేను ఒప్పుకొనను. లోకులు కాళాభాయి ఏనాడు అబద్ధము ఆడడు అని చెప్పినచో ఒప్పుకొనెదను. ఒక దృష్టాంతము వినుడు.

## లోక ప్రమాణము.

ఒక మిఠాయివర్తకుడు తినుబండారముల దుకాణమును కలిగి యుండెను. ఇంటికి ముందుభాగము దుకాణమునకును, వెనుకభాగము నిద్రించుటకును ఉపయోగించుచుండెను. ఒకరోజున ఆఇంటిలోనికి ఒకదొంగ ప్రవేశించెను. మిఠాయిలు మొదలగువానిని ఒకమూల నుంచి డబ్బుపెట్టిలోనుండి ధనమును తీసి మరియొకమూల నుంచెను. ఇదిగ్రహించి వర్తకుడు తలచెను. దొంగ ఎదుటికి వెళ్ళినచో నన్ను కత్తితోనో, మరియొకదానితోనో గాయపరచును. ఇట్లనుకొని ఆతడు ఒకయుక్తిని పన్నెను. "పిల్లీ, పొమ్ము, ప్రతిరోజున ఈవిధముగా బాధించుచున్నావు పొమ్ము" అనుచు దొంగదగ్గరకు వచ్చెను. యజమాని తనను చూచెనని దొంగ అనుకొనెను. ఆతడు సమీపమున ఉన్న బోషాణములో దూరి తలుపుమూసుకొనెను. వణిజుడు దగ్గరకు వెళ్లి బోషాణమునకు తాళమువేసి నిశ్చింతగా తనగదిలో కూర్చొనెను. కొంచెము సేపైనతరువాత పెట్టితలుపు తీసికొనలేక దొంగ మ్యావుమ్యావు అనదొడగెను. మ్యావుమ్యావు అనుటచే వర్తకుడు తనను పిల్లి అనుకొని మూతతీసి విడచినచో పారిపోవచ్చునని అతడు తలచెను. కాని వర్తకుడు బోషాణమువద్దకు వచ్చి పలికెను:—"నీవు ఎంత మ్యావు మ్యావు మనినను నిన్ను నేను పిల్లి అనుకొనను. ఉదయము జనులు అందరును వచ్చి పెట్టెతెరచినపిదప నీవు పిల్లి అని చెప్పినచో నిన్ను విడచెదను." ఈవిధముగనే జగమునందలి జనులు కాళాభాయి అబద్ధము ఆడడు అని చెప్పినచో అంగీకరించెదను. అంతవరకును అంగీకరించను.

## లోసమాన్యుడగు భక్తుడు.

జామనగరమునందున రామజీభాయి అను ఒక మహారాష్ట్రుడగు పోలీసుశిరస్తాదారుడు ఉండెను. ఆతడు చినిగినబట్టలు కట్టెడివాడు. ఎంతయో బుద్ధిమంతుడు. అతనికి ఇంగ్లీషు బాగుగా తెలియును. ఆతని ఇంట నాలుగైదు బొంతలుమాత్రమే ఉండెను. భిక్షుకుడెవడైన అడుగుటకు వచ్చిన అతడేమి అడిగిన అది ఇచ్చివేసెడివాడు. కుటుంబీకుడైనను రేపు ఏది జరుగునను చింత ఆతనికి ఉండెడిదికాదు. చనిపోవుటకు మూడునాలుగేండ్లముందు జీతముకూడ నాతడు ఉంచెడివాడుకాడు. జీతము పుచ్చుకొనినవెంటనే త్రోవలో ఎవడడిగినను ఇచ్చివేసెడివాడు. ఇంటికి వచ్చుసరికి జీతము పూర్తి అయిపోయెడిది. ఒకమారు ఆయనకు ఇట్లు చెప్పితిని:—రామజీబాయీ! నీవద్దకు అనేకరకములగు మనుష్యులు వచ్చుచున్నారు. వారు మీవద్దనుండి వస్త్రములు, చెంబులు, గిన్నెలు, ధనము మొదలగునవి తీసికొనిపోవుచున్నారు. తరువాత వారు ఆవస్తువులను అమ్మి డబ్బుచేసికొనుచున్నారు. పాత్రత, అపాత్రత వివేచించి దానముచేయుట మంచిది. అంతట ఆయన ఇట్లు సమాధానము చెప్పెను:— "నేను పాత్రాపాత్ర వివేకము చేయవలెనా! అట్లు చేయుటకంటె అడుగుటకు వచ్చినవారందరును పాత్రులే అనితలచి వారు అడిగినది ఇచ్చుచున్నాను." ఈ మాటలను విని నేను చెప్పితిని. "ధన్యుడవు. నీవు సంసారజీవితమునందుండికూడ ఇట్టిదృష్టి కలిగియున్నావు."

ఈ రామజీభాయిస్థితి నరసింహమెహతా, తుకారాముల వంటిది. జామనగరవాసులందరును అతనిని భక్తునిగ గుర్తించిరి. అటులే జేతపురమువందెల్లను మీరు భక్తులని చెప్పినచో నేను విశ్వసించెదను. అంతవరకును నమ్మను.

## సత్యమే ధర్మము.

డాక్టరు లల్లూభాయి [వేళాకోళముగా] ... కాళాభాయి ఇంటిలో నబద్ధము మాట్లాడకపోయినను వ్యాపారమునందు ఆడవలసి వచ్చును.

స్వా. ప్ర:— అసత్యమాడినగాని వ్యాపారము సాగదనుట తగదు. ఆరంభమున కొంచెము కష్టమయినను, నమ్మకము కలిగి నంతనే వ్యాపారమున ఎక్కువలాభమే వచ్చును. జనులుకూడ ఆతడే నమ్మకస్థుడని తలచి ఆతనివద్దనే సామానులు కొనెదరు. శ్రుతికూడ చెప్పుచున్నది. 'సత్యం వద ధర్మం చర' కావున సత్యమును పలుకుము. ధర్మముగా సంచరించుము. ఇందు ఒక సందేహమునకు అవకాశము కలదు. మనువు ధృతి, క్షమ మొదలగు పదివిధములగు ధర్మములను చెప్పెను. అందులో సత్యము సమావేశమైనదికదా? పై శ్రుతియందు సత్యంవద, అని మొదటసత్యమును నిరూపించినపిమ్మటనే ధర్మంచర అని ధర్మమును వేరుగా తెలిపెను. దీనికి కారణమేమి? ఈప్రశ్నలకు సమాధానము ఇది:—

సత్యము ధర్మమునకు పునాది సత్యేన రక్ష్యతే ధర్మః అని శ్రుతికూడ చెప్పుచున్నది. సత్యముచేతనే ధర్మము రక్షింపబడును. రాజగు హరిశ్చంద్రుడు సత్యముకొఱకు కొంచెమును జంకకుండ రాజ్యమునంతను త్యజించెను. సత్యముకొరకే విశ్వామిత్రమహర్షిఋణమును తీర్చుటకు రాజవైభవమును త్యజించెను. ఉదయసూర్యుని కూడ చూచియెఱుగని కోమలాంగియగు భార్యను, పుత్రుని ఒక బ్రాహ్మణునికడ దాసీతనము చేయుటకు అమ్మివేసెను. తాను చక్రవర్తియగు రాజయినను చండాలుని నౌకరీచేసి శ్మశానమునకు వచ్చిన శవములనుండి పన్ను వసూలుచేయు నీచవృత్తిని అవలంబించెను.

దశవిధధర్మములయందును ముఖ్యధర్మము సత్యమే. సత్యము లేకుండ మిగిలిన ధర్మములన్నియును ధర్మాభాసములుమాత్రమే.

సత్యప్రతిష్ఠాయాం క్రియాఫలాఽఽశ్రయత్వమ్ ।

"సత్యమునందు స్థిరత్వమును కనిగియుండుటచే ధార్మికక్రియాకలాపముల ఫలము ప్రాప్తించును."

మానవుడు కాయిక, వాచిక, మానసిక విధుల సత్యమును పాలించినచో అతనికి యజ్ఞము, దానము, తపము మొదలగు ధార్మిక కార్యములను ఆచరించుటచే స్వర్గాధిఫలములును, నిష్కామకర్మము ఉపాసన, జ్ఞానము మొదలగు ధార్మికక్రియలచే మలవిక్షేపదోష నివృత్తితో పాటు అంతఃకరణశుద్ధిద్వారా ఆవరణభంగమను ఫలమును ప్రాప్తించును. సత్యమును పాలించనిదే సకామకర్మలనుకాని నిష్కామకర్మలనుకాని ఆచరించుటచే కలుగుఫలము కలుగదు.

కాళా:— "నేను ఎరిగియుండి అసత్యమును పలుకను. అయినను నా సత్యవాక్పరిపాలనమునందు ఏదైన లోపము ఉన్నచో తమవంటివారికృపచే నిరంతరసత్యవాక్పరిపాలనము నాకు అలవడును.

పిదప రాత్రిభోజనానంతరము ఎల్లరును కూర్చొనిరి. మోక్షప్రాప్తికి సాధనము ఏమిటి అను కాళాభాయి ప్రశ్నించెను.

స్వా. ప్ర:— మోక్షసాధనమునుగురించి చెప్పుటకు తగిన అనుభవము నాకు లేదు. వినుట వినిపించుట— ఈ రెండుమాత్రమే ఈరోజులలో జరుగుపనులు. వైరాగ్యములేకుండ ప్రశ్నలు అడిగెదరు. జవాబుచెప్పువారు తెలిసికొనకుండగనే జవాబు చెప్పెదరు.

శ్రవణాయాపి బహుభిర్యో నలభ్యః శృణ్వన్తోఽపి బహవో యం న విద్యుః।
ఆశ్చర్యో వక్తా కుశలోఽస్య లబ్ధా ఆశ్చర్యో జ్ఞాతా కుశలానుశిష్టః ॥

'ఈ ఆత్మనుగురించి చాలమంది వినలేదు. చాలమంది విని కూడ తెలిసికొనలేదు. ఆత్మతత్త్వముగురించి ఉపదేశించువాడు దొరకుట ఆశ్చర్యకరమైనసంగతి. అనగా అట్టివారు దొరకుట దుర్ల

భము. చతురుడగువాడు ఎవ్వడోమాత్రమే దానిని పొందగలడు. కుశలునివద్దనుండి (బ్రహ్మజ్ఞానివద్దనుండి) ఉపదేశమును పొందిన జ్ఞాత కాని వక్త కాని దొరకుటకూడ దుర్లభము."

శ్రుతి వక్త దొరకుటకూడ ఆశ్చర్యమని చెప్పుచున్నది. తాను స్వయముగా అనుభవముపొంది నిజమునుచెప్పు వక్త ఈనాడు దుర్లభము. ఛాందోగ్యోపనిషత్తునందు సనత్కుమారుడు నారదునకు చెప్పెను:—

*యదా వై విజానాత్యథ సత్యం వదతి నాఽవిజానన్ సత్యం వదతి విజానన్నేవ సత్యం వదతి॥*

"బ్రహ్మమును తెలిసికొనినవాడే నిజమును చెప్పును. తెలిసికొననివాడు నిజమును చెప్పడు. సవిశేషముగా తెలిసికొనినవాడు అనగా పూర్ణానుభూతిని పొందినవాడుమాత్రమే నిజము చెప్పును.

## శ్రోతలలో భేదములు.

తెలిసికొనువారుకూడ చెప్పెడివారివలెనే దొరకుట దుర్లభము. శ్రోతలు చాలమంది ఉందురు. కాని వస్తువును గ్రహించు తీవ్రవైరాగ్యవంతుడు దొరకుట దుర్లభము.

*మృచ్చాలినీమహిషహంసశుకాశ్వభావా మార్జారకాకమశకౌఘజలౌకతుల్యాః।*
*సచ్ఛిద్రకుమ్భపశుసర్పశిలోపమానాస్తే శ్రావకా భువి చతుర్దశధా భవన్తి॥*

"మట్టి, జల్లెడ, ఎనుబోతు, హంస, చిలుక, గుర్రము పిల్లి, కాకి, దోమ, జలగ, చిల్లికుండ, పశువు, సర్పము, రాయిలవలె 14 రకముల శ్రోతలు భూమిమీద కలరు."

1. మట్టి:— మట్టిలో నీరుపడినంతనే మెత్తబడును. కాని కొంచెముసేపు అయినతోడనే ఎండిపోయి గట్టిపడును. అటులనే ఈరకమునకు చెందిన శ్రోతకూడ ఉపదేశమును వినినంతనే ద్రవించిపోవును. కాని కొలదిక్షణములలోనే యథాప్రకారమగు జీవితమును గడుపును.

2. జల్లెడ:— జల్లెడలో ధాన్యము ఉన్నంతవరకును బాగుగనే ఉండును. జల్లించిన కొలదియు అందు చెత్త పెరుగును, జల్లెడ చెత్తనే గ్రహించును. అటులనే కొందరు శ్రోతలు మానసిక అస్థిరత్వముచే వినిన ఉపదేశమునందలి సారమును విడనాడి అందలి స్థూల విషయములను మాత్రమే గ్రహించెదరు.

3. మహిషము :— మహిషము నీటిలోనున్నంతసేపు శాంతముగా నుండును. కాని బైటికి వచ్చినంతనే పూర్వావస్థను పొందును. శాంతినిచ్చునీటినికూడ అపరిశుద్ధము చేయును. అటులనే వినినంతసేపును సక్రమముగనుండి తమవ్యవహారమునందు పడిన వెంటనే పూర్వావస్థను పొందువారును, వినిన ఉపదేశములను తమ జడబుద్ధితో కశ్మలముచేయువారును మహిషశ్రోతలని అనబడుదురు.

4. హంస :— హంస నీటిని, పాలును వేరుచేయును. అటులనే సత్యాసత్యములను వేరుచేయు వివేకవంతులు హంసశ్రోతలు.

5. చిలుక :— చిలుకవలె నామోచ్చరణచేయుచు దాని అర్థమును తెలిసికొననివారు.

6. గుర్రము :— తనవీపుపై రౌతు ఉన్నంతసేపు గుర్రము కళ్ళెమునకు లోబడి నడచును. కళ్లెము తీసివేసినతంనే తనఇష్టమువచ్చినట్లు నడుచును. అటులనే గురువుగారి అధీనములోనున్నంతకాలము ఉపదేశములను అనుసరించి వారికిదూరము అయినవెంటనే మారు త్రోవను పట్టువారు.

7. పిల్లి :— పిల్లి ఎంతశాంతముగ కూర్చొనియున్నను తన వేటజంతువగు ఎలుక కన్పించినంతనే జాగ్రత్తపడును. అటులనే ఉపదేశమునువిని శాంతినిపొందినను పైకి ఏకాగ్రతతో నున్నట్లు కన్పించినను స్వార్థమునకు సంబంధించిన ప్రశ్నవచ్చినప్పుడు తమ మామూలునడక ప్రకారము జాగ్రత్తపడువారు.

8. కాకి :— కాకి ఉత్తమమగు పదార్థమును తినినవెంటనే నీచమగు మలమువంటి పదార్థముపై కూర్చొనును. అటులనే ఉత్తమ ఉపదేశమును పొందినవెంటనే దురాచారమునకు సంబంధించిన విషయములయందు నిమగ్నమగువారు.

9. దోమ :— దోమ తనకు తృప్తికలుగకపోయినను ఇతరుల చెవివద్దకు వెళ్లి అప్రియమగు శబ్దమును చేసి వారిని సుఖముగా కూర్చొననీయదు. అటులనే తనకు మేలుకలుగకపోయినను ఇతరులు శ్రవణముచేసిన సద్వాక్యముల ప్రభావమును తమపాడుమాటలచే ఖండించువారు.

10. జలగ:— జలగ ఇతరులకు బాధకలుగజేయును. తన జీర్ణశక్తి కిమించిన రక్తమును పీల్చును. అటులనే కొందరుశ్రోతలు వక్తలను బాధించి తమశక్తికిమించిన విషయములను గ్రహింపబూనెదరు.

11. చిల్లికుండ:— చిల్లికుండలో పోసిననీరు కొలదిసేపటిలో కాళీఅయిపోవును. అటులనే వినినఉపదేశములను కొందరు నెమ్మది నెమ్మదిగా మరచిపోయెదరు.

12. పశువు:— పశువులకు ఎంతనేర్పినను నిత్యాభ్యాసము లేనిచో మరచిపోవును. అటులనే కొందరుశ్రోతలు గురువులు శ్రమపడిచెప్పిన ఉపదేశములను తమస్వాభావికములగు కుసంస్కారములచే విడచివేయుదురు.

13. సర్పము:— సర్పమునకు పాలు త్రాగించినను విషరూపమునే పొందును. అటులనే ఆరకమునకు చెందినశ్రోతలు సదుపదేశములను తప్పుడుఅర్థములలో గ్రహించి ప్రపంచమునకు హాని చేయుదురు.

14. శిల:— కఠినమగు రాతిపై ఎంతనీరుపోసినను అది గట్టిగనే ఉండును. అటులనే దుర్జనులకు ఎంతబోధించినను తమదుర్మాల ప్రకృతిని వారు విడనాడరు.

ఈపదునాలుగురకముల శ్రోత్రలలోను హంసశ్రోత్రయే ఉత్తముడు.

*విరక్తస్య హేయజ్ఞానముపాదేయోపాదానం హంసక్షీరవత్ ।*

(సాంఖ్యసూత్రము)

"హంస నీరమును విసర్జించి క్షీరమునుమాత్రమే గ్రహించును. అటులనే వైరాగ్యవంతుడగు వివేకి త్యజించవలసిన మాయాతత్త్వములను త్యజించి గ్రహించదగిన సారమును బ్రహ్మతత్త్వమును గ్రహించును."

## ఉపదేశములను వినుటలో నేడుకన్పించు గుడ్డినమ్మకము.

ఇది అంతయును కృతయుగమునకు చెందినసంగతి. ఇక కలియుగమునందు ఇట్టివిషయమున ఆశ్చర్యముఏమి? అందరును వైభవవిలాసములలో మునిగి తేలుచున్నారు. తులసీరామాయణమున కలియుగవర్ణనమున కాకభుశుండి గరుడునితో చెప్పెను:—

*గురుశిష్య అంధ బధిరకర లేఖా,*
*ఏక న సునే ఏక నహి దేఖా.*

కలియుగమునందలి గురువులు గుడ్డివారు. శిష్యులు చెవిటివారు. గురువులు బ్రహ్మమును తెలిసికొనకుండ ప్రతిపాదించెదరు. వైరాగ్యమును పొందనిదే శిష్యులు శ్రవణముచేయుదురు.

*'జీవన్ముక్తశ్చ'* సాంఖ్యసూత్రములు.

"జీవన్ముక్తుడే ఉపదేశించుటకు తగినవాడు." ఎవడు బ్రహ్మానుభవమునుపొంది జీవించియుండగనే ముక్తినిపొందెనో ఆతడే సత్యమును చెప్పును.

*'ఇతరతః అన్ధపరమ్పరా ।'* సాంఖ్యసూత్రములు.

జీవన్ముక్తుడుతప్ప మిగిలినవారిపద్దనుండి ఉపదేశములను గ్రహించుట గుడ్డినమ్మకముమాత్రమే.

ఈరోజులలో శాస్త్రములనుచదివి, అనుభవమునుపొందకుండ చేయుఉపదేశములు అన్నియు గుడ్డినమ్మకమునకు చెందినవే.

ఒకగ్రామమున ఒకగుడ్డివాడు ఉండెను. చాలకాలమునుండి అభ్యాసము ఉండుటచే అతడు తనగ్రామములో ఇతరులసహాయము అక్కరలేకుండ తిరుగగలిగెడివాడు. ఒకనాడు ఆగ్రామమునందలి నలుగురైదుగురు గుడ్డివాండ్రకు యాత్రచేయవలెనని వేడుకపుట్టెను. వారు పలికిరి:—

"మేము గుడ్డివారము. అందుచే ఇతరులసహాయములేనిదే వెళ్ళలేము. మొదటిగ్రుడ్డివాడు ధనలోభముచే నిట్లనెను:—

"అదేమిటి. రండు, నేను మీచే యాత్రచేయించుదును. నేను అన్నిచోట్లకు వెళ్ళగలను. కాని ఒకసంగతి. ఎవరైన నన్ను గుడ్డివాడని వేళాకోళము చేసినచో మీరు నమ్మవద్దు. నేను చూడగలను."

వారు ఒప్పుకొనిరి. ఒకనిచేతులు మరియొకడు పట్టుకొనెను. మొదటి గుడ్డివాడు ముందు నడువసాగెను. గ్రామీణులు ఇదిచూచి పలికిరి:—

ఓరీగుడ్డివాడా! నీవు ఈగుడ్డివాళ్ళను అందరిని తీసికొని ఎక్కడకు వెళ్ళుచున్నావు?"

గుడ్డివాడు పలికెను:— "నేను గుడ్డివాడను కాను. మీరే గుడ్డివారు."

ఇట్లని వాడు అందరికంటె ముందు నడచెను. అట్లు నడచుచుండగా మార్గమునందు ఒకపెద్దగొయ్యి వచ్చెను. గుడ్డివాడు దానిని చూడలేకపోయెను. కాలుజారి అతడు ఆగోతిలో పడెను. ఆతని చేయిపట్టుకొని వచ్చుచున్న మిగిలినగుడ్డివారుకూడ ఆగోతిలోపడిరి.

ఇదేవిధముగా చాలచోట్ల సామాన్యమగు శాస్త్రాభ్యాసము చేసి "నేను మహావిద్వాంసుడను, పండితుడను, జ్ఞానిని అను గర్వ

ముతో చదువురాని పామరులను తప్పుడుమార్గమున నడిపించి దుఃఖ మను గోతిలో పడ వేయుదురు.

ఈవిషయమున కఠోపనిషత్తునందు యమధర్మరాజు నచికేతు నకు చేసిన ఉపదేశమును పరికించుడు:—

అవిద్యాయామన్తరే వర్తమానాః స్వయం ధీరాః పణ్డితంమన్యమానాః।
దన్ద్రమ్యమాణాః పరియన్తి మూఢా అన్ధేనైవ నీయమానా యథాన్ధాః॥

"అవిద్యాగతులగు మూఢులు తాము ధీరులము, పండితులము అనుకొని అనేకములగు తప్పుడుత్రోవలను పట్టుదురు. గ్రుడ్డివాడు గ్రుడ్డివారిని తప్పుడుత్రోవను పట్టించునట్లు అజ్ఞులను మూఢుత్రోవను పట్టించెదరు. అట్లు భ్రాంతచిత్తులయి భ్రమించుచుందురు."

అవిద్య అనుఘోరమగు అంధకారమునందు ఉండుమూఢులు ధనాదిమాయికపదార్థములను అనుభవించుచు అనేకవిధములగు ఆశ లను పాశములచే బద్ధులయి తాము బుద్ధిశీలురము, శాస్త్రజ్ఞులము, అనుకొనుచు అనేకవిధములుగా అత్యంతము కుటిలములగు నడవడిక లతో అంధునిచే నడుపబడినవారు సరియగుమార్గమును విడచి తప్పుడుత్రోవను పట్టునట్లు మోక్షమార్గమునుండితప్పి జన్మ, మరణ, రోగాది దుఃఖములలో పడి తిరుగుచునుందురు.

ఇట్టిగ్రుడ్డివారు ఇతరులకు ఎట్లు మార్గము చూపుదురు?

స్వా. ని :— మనకు అనుభవము లేకపోయినను సత్పురుషుల అనుభవము వినుటలోను, చెప్పుటలోను దోషము లేదు.

స్వా. ప్ర :—చిలుకనుపెంచి మాటలునేర్పి అది మాట్లాడు చుండగా విని సంతోషించునట్లు తమరు నేను మాట్లాడుచుండగా సంతోషించుచున్నారు.

## అనాదియగుసంస్కారము - విషయవాంఛల ప్రాబల్యము.

శా॥ :— అయిన బ్రహ్మవిద్య విను అధికారము ఎప్పుడు కలుగును?

స్వా. ప్ర:—

విషయాసక్తినాశేన వినా నో శ్రవణం భవేత్ ।
తాభ్యామృతే న మననం న ధ్యానం తైర్వినా భవేత్ ॥

"విషయములయందలి ఆసక్తిని పోగొట్టుకొనకుండ శ్రవణము సాధ్యము కాదు. విషయాసక్తిత్యాగము, శ్రవణము— ఈరెండును లేనిదే మననము చేయుశక్తి కలుగదు. పైమూడును కుదురనిదే ధ్యానము జరుగదు."

అధికారము లేనిదే శ్రవణముజరుగదు. ఇక మనననిదిధ్యాసనముల సంగతి చెప్ప నేల,

శా॥:—నేను వృద్ధుడను అయితిని. కావున ఇక విషయాసక్తి కలుగుటకూడ సంభవము కాదు.

స్వా. ప్ర :—నవే వయసి యః శాన్తః స శాన్త ఇతి మే మతిః ।
ధాతుషు క్షీయమాణేషు శాన్తిః కస్య న జాయతే॥

"యౌవనవయస్సునందు శాంతినొందినవాడే శాంతుడు. వార్ధక్యమున ధాతువులు క్షయమును పొందినతరువాత ఎవడు శాంతిని పొందడు?"

యౌవనమునందే ఇంద్రియములను అదుపులోనుంచి, వానిని ప్రభువునకు సమర్పించి శాంతిని పొందినచో అదియే నిజమగుశాంతి అనబడును. దేవునకు అప్పటికప్పుడు వికసించిన పుష్పములతో పూజచేయవలెను. కాని వాడిపోయినపూవులతో పూజించరాదు ... ... మీకు శాంతికిసంబంధించిన మాటచెప్ప అవకాశము

ఏది? పైగా విషయవాంఛలు ఒకరకముగ నుండవు. వృద్ధులయందు అన్నపానాదులయందు ఎక్కువఆసక్తి కానవగును. శరీరము వార్ధక్యమును పొందినను మనస్సుమాత్రము యౌవనమునందే యుండును.

కాళా:—తమదయచే మనస్సుకూడ వార్ధక్యమును పొందినది.

స్వా. ప్ర:—మోక్షమునుగురించి మీరు ప్రశ్నించిరి. మోక్షము అనగా నేమియో ఎరిగియుండి ప్రశ్నించిరా? కేవలము ఆమాటమాత్రము విని ప్రశ్నించిరా?

స్వా. ని:—ఈయన ఆత్మపురాణము, యోగవాశిష్ఠము మొదలగు పుస్తకములను అధ్యయనముచేసిరి. ఆమాత్రము తెలియకుండ అడుగుదురా?

స్వా. ప్ర:— ఎరిగినవారు అడుగవలసినపని లేదు. మాటిమాటికి అడిగి ఇతరులను బాధించినచో తనకువచ్చిన ప్రయోజనము లేదు.

స్వా. ని:— ఈయన తెలిసికొనిన విషయమును నిర్ధారణచేసికొనుటకు అడిగిరి. స్థూణానిఖననన్యాయమున వీరు ప్రశ్నించుచున్నారు.

కాళా:—అవిద్యనుండి ముక్తినిపొందుట మోక్షము అని నాఅభిప్రాయము. ఇందు తప్పు ఏమైన ఉన్నచో తమరు సరిచేయుడు.

## అవిద్యాభేదములు.

స్వా. ప్ర:—అవిద్య రెండురకములు :— మూలావిద్య 2. తూలావిద్య. విషయావచ్ఛిన్నమగు చైతన్యమును ఆశ్రయించినది మూలావిద్య. మూలావిద్యయొక్క బంధనమునుండి ముక్తినిపొందుట మోక్షము. దానికి సరియగు కారణము జ్ఞానము.

జ్ఞానాదేవ తు కైవల్యమ్.

"జ్ఞానముచేతనే మోక్షము కలుగును." జ్ఞానముభక్తియును, వైరాగ్యమును లేనిదే కలుగదు. పదార్థములయందలి మోహబుద్ధి ఉన్నంతకాలము వైరాగ్యము కలుగదు. వివేకముద్వారా పదార్థములయందలి మోహముపోయి వస్తువుయొక్క యథార్థస్వరూపము తెలిసినప్పుడు వ్యక్తికి వైరాగ్యము కలుగును.

మోహము ప్రబలమగు శత్రువు.

*యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతి తరిష్యతి ।*
*తదాగన్తాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ॥ (గీత)*

"ఓ అర్జునా! నీ అంతఃకరణము మోహము అను మాలిన్యమును త్యజించిననే శ్రవణముచేయదగిన కర్మయొక్క ఫలితమును, శ్రవణముచేయబడిన కర్మఫలముయొక్క వైరాగ్యమును నీకు కలుగును."

మోహము సాధకునకు ప్రబలశత్రువు. మోహప్రాబల్యముననే పురుషుడు వివిధములగు విషయపదార్థముల భోగమును కోరును. భోగమునందు అనేకవిధములగు కష్టములు కలవని తెలిసికొననివారును, వానిని అనుభవించినవారుసుకూడ మోహగ్రస్తులయి మాటిమాటికి విషయభోగపరాయణులగుదురు. మోహమహిమను భర్తృహరి ఇట్లు వర్ణించెను.

*అజానన్ మాహాత్మ్యం పతతు శలభో దీపదహనే*
*స మీనోఽప్యజ్ఞానాద్బడిశయుతమశ్నాతు పిశితమ్।*
*విజానన్తోఽప్యేతే వయమిహ విపజ్జాలజటిలా*
*న్న ముఞ్చామః కామానహహ గహనో మోహమహిమా*

"అగ్నియొక్క గొప్పతనమును తెలియని మిడుత ఒడలు తెలియక అగ్నియందు పడినచో పడవచ్చును. మత్స్యముకూడ అజ్ఞానముచేతనే కర్రికుకట్టిన మాంసమును భక్షించును. కాని ప్రపంచమునందలి విషయములు విజ్ఞాపనుచే ఆవృతములై యున్నవి అని మాకు తెలి

యును. అయినను వానిని విడచుటలేదు. మోహముయొక్క మహిమ ఆహా! ఎంతగొప్పది?"

మిడుతలు, చేపలు, పశువులు, పక్షులు మొదలగునవి మోహపాశబద్ధులే. అదేవిధముగ సామాన్యులగు ప్రాకృతజనులు కూడ మోహబంధమునుండి ముక్తులుకారు. ఇది బాగుగనే ఉన్నది. కాని గొప్పగొప్ప శాస్త్రములు చదివిన విద్వాంసులును, పండితులును కూడ మోహజాలమున చిక్కువడి వేదశాస్త్రములఆజ్ఞలను ఉల్లంఘించి విషయపదార్థములను పొందుటకు గోలచేయుచుందురు. ప్రబోధచంద్రోదయమున చార్వాకుడు మహామోహప్రభువులవారి మహిమను వర్ణించుచు ఇట్లుపలికెను.

*వ్యతీతవేదార్థపథః ప్రథీయసీం యథేష్టచేష్టాం గమితో మహాజనః।*
*తదత్ర హేతుర్న కలిర్న చాప్యహం ప్రభుప్రసాదో హి తనోతి పౌరుషమ్॥*

"విద్వాంసులు, బ్రాహ్మణులు, సన్యాసులు, గురువులు, ఆచార్యులు మొదలగు ధర్మపరాయణులగు మహానుభావులుకూడ వేదశాస్త్రములు చెప్పుమార్గమును ఉల్లంఘించి ఇష్టమువచ్చినట్లు సంచరించుచున్నారు. అందుకు కలియుగము కారణము కాదు. నేను (చార్వాకుడు) కారణము కాదు. తమయొక్క (మోహముయొక్క) కృపాకటాక్షములే ఇందుకు కారణములు."

## మోహమును జయించిన వైరాగ్యము జనించును.

మోహము అను శత్రువు ఇంతప్రబలుడు. ఆ శత్రువును జయించిననే కాని మోక్షము లభించదు. ఏలనన అంతవరకు పురుషునకు దేహమునందు అహంబుద్ధి యుండును. ఎన్నియో కోరికలను అనుభవించుచు విషయపదార్థములను వెంటాడుచుండును.

అంతఃకరణమునుండి మోహము పోయినప్పుడే వైరాగ్యము ద్వారా అధికారి (శ్రవణ, మననాదులఫలితము శీఘ్రముగా పొందును.

ఇహ, పరలోకములు కర్మఫలములుమాత్రమే అగుటచే అనిత్యములు. కావున ముముక్షువులు వానియందు వైరాగ్యమును పొందవలెను.

శ్రుతి చెప్పుచున్నది:—

"పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్య కృతః కృతేన"

"లోకములు అన్నియును కర్మచేతనే లభించును అనే విషయమును పరీక్షించి తెలిసికొని కర్మద్వారా లభించులోకములు అనిత్యములు. వానిచే నిత్యపదార్థమగు ఆత్మతత్త్వమును పొందలేము అని నిశ్చయించుకొని బ్రాహ్మణుడు వైరాగ్యమును పొందును."

## వై రా గ్య భే ద ము లు.

వైరాగ్యము రెండురకములు. 1. అపరవైరాగ్యము 2. పరవైరాగ్యము. అపరవైరాగ్యము మరల నాలుగురకములు:— 1. యతమానము 2. వ్యతిరేకము 3. ఏకేంద్రియము 4. వశీకారము.

1. యతమానవైరాగ్యము:— ప్రపంచమునందు "ఇది సారముకలపదార్థము, ఇది సారములేనిపదార్థము" అను సారాసార వివేకము యతమానవైరాగ్యము.

2. వ్యతిరేకవైరాగ్యము:— చిత్తమున రాగద్వేషాది దోషములు కలవు. అందు ఫలానదోషములు నివృత్తినిపొందినవి. ఫలాన దోషములు మిగిలినవి అని విచారముచేసి మిగిలినదోషములను నివృత్తినిపొందించుటకు ప్రయత్నించుట వ్యతిరేకవైరాగ్యము.

3. ఏకేంద్రియవైరాగ్యము:— మనస్సునందు విషయేచ్ఛలున్నను ఇంద్రియనిరోధమునకు ప్రయత్నించుట ఏకేంద్రియ వైరాగ్యము.

4. వశీకారవైరాగ్యము:— ఇహలోకపరలోకములయందలి విషయములు నశ్వరములు అని తెలిసికొని వానిని త్యజించగోరుట వశీకారవైరాగ్యము.

వశీకారవైరాగ్యము మూడురకములు :- మంద, తీవ్ర, తీవ్రతరములు.

1. మందవైరాగ్యము :— దారపుత్రధనాదుల వియోగముచే ప్రపంచమును త్యజించవలెనను కోరిక కలుగుట.

2. తీవ్రవైరాగ్యము:— ఈజన్మమున దార, పుత్ర, ధనాదులు నాకు లభించరాదు అను స్థిరబుద్ధితో సంసారమును త్యజించుట.

3. తీవ్రతరవైరాగ్యము :— ఇహలోకపరలోకములయందలి ఎల్లవిషయములయందలి కోరికలను పరిత్యజించవలెనను తలంపు కలుగుట.

ఈవైరాగ్యములన్నిటికంటెను ఉత్కృష్టమగునది పరవైరాగ్యము. యోగసూత్రములు చూడుడు:—

"తత్పరం పురుషఖ్యాతేర్గుణవైతృష్ణ్యం"

"పురుషసాక్షాత్కారముచే సకలగుణములయందును ఉద్భవించిన వైతృష్ణ్యము (తృష్ణాఽభావము) శ్రేష్ఠమగు పరవైరాగ్యము."

నిష్కామకర్మచే అంతఃకరణమునందలి మలదోషము నివృత్తినిపొందినతరువాత వైరాగ్యము కలుగును. అప్పుడే సమాధిని అభ్యసించుటకు అధికారము కలుగును. మల, విక్షేపదోషములు నివృత్తినిపొందుటచే అంతఃకరణమునందలి రజస్తమోగుణములు అణచబడి సత్త్వగుణమను దైవసంపద లభించును.

## సత్త్వగుణభేదములు.

సత్త్వగుణము రెండురకములు. 1. మిశ్రమసత్త్వము. 2. శుద్ధసత్త్వము. మిశ్రమసత్త్వమనగా దైవసంపద. శుద్ధసత్త్వమనగా ఆత్మసాక్షాత్కారము. చిత్తమునందు దైవసంపద కలిగి

నప్పుడు సమాధిని అభ్యసించుటకు సామర్థ్యము వచ్చును. భగవానుడు గీతయందు చెప్పెను :-

## యో గ ప్రా ప్తి

శ్రుతివిప్రతి పన్నా తే యదాస్థాస్యతి నిశ్చలా,
సమాధావచలాబుద్ధిస్తదా యోగమవాప్స్యసి. (గీత)

"అర్జునా! నానావిధములగు స్వర్గాదిసౌఖ్యములను ప్రతిపాదించు శ్రుతిని విని సంశయమును పొందిన నీబుద్ధి పరమాత్మునియందు స్థిరపడిన నీకు యోగము సిద్ధించును."

సారాసారవివేకముచేయు సామర్థ్యములేనిబుద్ధి గాలికలచోటనున్న దీపశిఖవలె చంచలముగ నుండును. ఇహలోకమునుండి బ్రహ్మలోకమువరకును ఉన్న అన్నివిధములగు సుఖములయందును తుచ్ఛత్వభావము కలుగనంతవరకు చిత్తవృత్తి చాంచల్యరహితము కాదు. ఆత్మనిష్ఠ కలుగదు. చాంచల్యమును పోగొట్టుకొనుటకును, ఆత్మతత్త్వమునందు చిత్తమును స్థిరపరచుటకునుమాత్రమే సాధకుడు యోగాభ్యాసమును చేయవలెను.

## అ హం గ్ర హో పా స న.

యోగము అను శబ్దమును ఇచ్చట భగవానుడు ధ్యానయోగమును ఉద్దేశించి చెప్పెను. ధ్యానమునుగురించి అపరోక్షానుభూతియందు శంకరభగవత్పాదులు ఈవిధముగ తెలిపిరి:—

బ్రహ్మైవాస్మీతి సద్వృత్త్యా నిరాలంబతయా స్థితిః,
ధ్యానశబ్దేనవిఖ్యాతా పరమానన్దదాయినీ.

"నేను బ్రహ్మమును అను బాధారహితమగు వృత్తిద్వారా ఆలంబనరహితమగు ఆనందమును కలుగజేయుస్థితి ధ్యానము అని ప్రఖ్యాతమయి యున్నది."

ఇది అహంగ్రహోపాసన అనబడును.

ఉపాస్యవస్తువు భిన్నమైనది అని ఉపాసించుట భేదోపాసన. అందు ఆభావనను అనుసరించే బ్రహ్మలోకము లభించును. అభేదోపాసనచే ఈశరీరమునందు జ్ఞానము కలిగి ముక్తిని పొందును. కావున భేదోపాసనము మముక్షువులకు నిషిద్ధము.

"అథ యోఽన్యాం దేవతాముపాస్తేఽన్యోఽసావన్యోఽహమస్మీతి న స వేద"

"ఉపాస్యము నాకు భిన్నమైనది; ఉపాస్యమునకు నేను భిన్నుడను అను భేదభావముతో భిన్నదేవోపాసన చేసినవాడు ఉపాసనాస్వరూపమును అర్థము చేసికొనలేదు"

## సమాధిభేదములు.

ఈవిధముగ అభేదోపాసనచేయగా అధికారికి సమాధి కలుగును. సమాధి రెండురకములు. 1. సవికల్పము 2. నిర్వికల్పము. సవికల్పసమాధి నాలుగురకములు: —

1. బాహ్యశబ్దానువిద్ధము, బాహ్యశబ్దాననువిద్ధము.
2. బాహ్యదృశ్యానువిద్ధము, బాహ్యదృశ్యాననువిద్ధము.
3. ఆన్తరికశబ్దానువిద్ధము, ఆన్తరికశబ్దాననువిద్ధము.
4. ఆన్తరికదృశ్యానువిద్ధము, ఆన్తరికదృశ్యాననువిద్ధము.

నిర్వికల్పసమాధి రెండురకములు :— 1. బాహ్యనిర్వికల్పసమాధి 2. ఆన్తరనిర్వికల్పసమాధి.

సవికల్పసమాధియొక్క పరిపక్వావస్థ నిర్వికల్పసమాధి.

నిర్వికారతయా వృత్త్యా బ్రహ్మాకారతయా పునః,
వృత్తివిస్మరణం సమ్యక్ సమాధిర్జ్ఞానసంజ్ఞకః.

"నిర్వికారవృత్తియును బ్రహ్మాకారవృత్తిచే ఆత్మవృత్తివిస్మరణము జ్ఞానము అను ఉత్తమసమాధి."

ఆవరణభంగము అయినపిదప ధ్యేయాకారమగు వృత్తి జ్ఞేయాకారమగుటచే ఈసమాధి జ్ఞానసమాధి అనబడును.

నిర్వికల్పసమాధి రెండురకములు:— 1. అద్వైత భావన 2. అద్వైతావస్థ. అందు ధ్యాత, ధ్యానము, ధ్యేయము అను త్రిపుటి ఉండదు. కావున వృత్తి బ్రహ్మాకారము అగును. అది అద్వైతభావన అను నిర్వికల్పసమాధి. ఈ అద్వైతభావన అను వృత్తి స్వరూపమున లయమును పొందినప్పుడు అద్వైతావస్థ అను నిర్వికల్పసమాధి సిద్ధించును.

## యోగమును సాధించుటలో అభ్యంతరకరములగు 8 విఘ్నములు.

సమాధి అను ప్రయత్నముచే ఆత్మజ్ఞానము అను సిద్ధి కలుగుటకు ముందు సాధకుడు మార్గమధ్యమున అనేక విఘ్నములను ఎదుర్కొనవలసి వచ్చును.

అపరోక్షానుభూతియందు శంకరభగవత్పాదులు చెప్పిరి:—

సమాధౌ క్రియమాణే తు విఘ్నా ఆయాన్తి వై బలాత్ ।
అనుసన్ధానరాహిత్యమాలస్యం భోగలాలసా ॥
లయస్తమశ్చ విక్షేపో రసాస్వాదశ్చ శూన్యతా ।
ఏవం యద్విఘ్నబాహుల్యం త్యాజ్యం యోగవిదా శనైః ॥

"సమాధిని పొందినప్పుడు ఈవిఘ్నములను ఎదుర్కొనవలసి వచ్చును:— 1. అనుసంధానరాహిత్యము 2. ఆలస్యము 3. భోగలాలస 4. లయము 5. తమము (కార్యాకార్య అవివేకము) 6. విక్షేపము 7. రసాస్వాదము 8. శూన్యత్వము. ఇట్టి విఘ్నములను యోగము తెలిసికొనినవాడు మెల్లమెల్లగా తప్పించుకొనగలుగును."

*1.* అనుసంధానరాహిత్యమ్ :— ధ్యేయాకార వృత్తియొక్క స్థిరత్వము భంగమగుట. విషయములద్వారా అనుసంధానము భగ్న

మగును. ఆవిఘ్నము బ్రహ్మైక్యభావమును అభ్యసించుటచేతను, వైరాగ్యముచేతను పోవును.

2. ఆలస్యమ్:— శరీరేంద్రియముల భారముచే-సోమరితనముచే ఉద్భవించు ఉత్సాహరాహిత్యము. తగిన ఆహారవిహారములచే కఫాదులు నివారించబడి ఈవిఘ్నము పోవును.

3. భోగలాలసా:— సుగంధాది అష్టవిధభోగములను అనుభవించవలెనను కోరిక. గృహస్థులు యోగప్రవృత్తులయినవారికికూడ భోగలాలస కలుగును. ఇక మందవైరాగ్యముకల సన్యాసులు భోగలాలసను ఎదుర్కొనవలసివచ్చుటలో ఆశ్చర్యము లేదు. విషయపదార్థము లన్నిటియందును దోషదృష్టిని కలిగియుండుటచే, తన శ్రేయస్సునుగురించి ఆలోచించుటచే ఈవిఘ్నము తొలగును.

4. లయః :— అజీర్ణము, నిద్రలేమి, పరిశ్రమ మొదలగువానిచే బ్రహ్మాకారవృత్తి కలుగదు. అది లయము. ఈవిఘ్నమును పోగొట్టుకొనుటకు లఘువగు పథ్యభోజనమును చేయవలెను. ఉత్థానప్రయత్నముచే చిత్తమును మేల్కొల్పవలెను.

5. తమః :— సాధనమును అసాధనముగను, అసాధనమును సాధనముగను తలచు భ్రాంతి తమము. యోగసాధకుడు స్త్రీధనాదులకు దూరముగనుండి ఏకాంతమున యోగమును అభ్యసించవలెను. అట్లుచేయక, దారపుత్రాదులు అవసరమయినవి అని భావించి వారిని దగ్గరనుంచుకొని యోగమును అభ్యసించుట అసాధనము సాధనముగా భావించుట అనబడును. ఈవిఘ్నము పూర్వజన్మపుణ్యముచేతను యోగ్యులగు గురువుల ఉపదేశముననుసరించి ఆచరించుటవలనను, సమాధిప్రతిపాదకములగు శాస్త్రములను అభ్యసించుటవలనను తొలగిపోవును.

6 విక్షేపః :—రాజసవృత్తిచే ఉత్పన్నమయిన కామా

ములచే కలుగు మనశ్చాంచల్యము. ఈవిఘ్నము విషయపదార్థముల యందు దోషదృష్టిని పొందుటచే పోవును.

7. రసాస్వాదః:—విషయసుఖముకంటె బ్రహ్మసుఖము యోగులకు లభించును. ఆరసమును ఆస్వాదించుటకు ధ్యానము చేయుచుండగా కలుగు ఏకాగ్రతయందు జీవబ్రహ్మములమధ్య అజ్ఞానము అను తెర ఉండును. ఆతెరకు దగ్గరగా వెళ్ళునప్పుడు ఒక విధమగు ఆనందవృత్తి కలుగును. కొందరు అదియే బ్రహ్మము అని అచ్చట విరమించెదరు. కాని నిజమునకు అది మాయికమగు సుఖము. బ్రహ్మసుఖము కాదు. ఉదాహరణకు ఎవడైన చెరువు నందలి నీటిని స్పృశించుచుండగా కలుగు చల్లదనము నీరు అని భావించుట ఎట్లు భ్రాంతి అగునో అటులనే అదికూడ భ్రాంతియే. ఈవిఘ్నము బ్రహ్మసుఖమే సర్వోత్కృష్టము అను భావముచే తొలగును.

8. మాన్యతా:—వృత్తి మూఢాకారమును పొందుట. దీనిని స్తబ్ధవృత్తి అనెదరు. స్తబ్ధవృత్తి విషయరూపమును కాదు, సుషుప్తియును కాదు, ధ్యానాకారమును కాదు. అయినను నేను ధ్యానము చేయుచున్నానని సాధకుడు తలచును. కాని వృత్తి ధ్యానాకారముగానుండక మూఢాకారముగా నుండును. ఇది స్తబ్ధ వృత్తి. ఈవిఘ్నమును పోగొట్టుకొనుటకు అనుభవముకల గురువు నొద్ద నేర్చుకొనిన ధ్యానాదిక్రియలలో ప్రవృత్తిని పొందుట ఆవశ్యకము.

ఈ ఎనిమిదివిఘ్నములు యోగమార్గమునందలి అంతరాయ ములు. వీని అన్నిటిని సాధకుడు మెల్లమెల్లగా దాటవలెను. అందుకు సాధకుడు చిత్తవృత్తిని ఏకాగ్రమునొందుటకు నిరంతరము చాల కాలము శ్రద్ధగా ప్రయత్నించవలెను.

## యోగాభ్యాసము నిరంతరము చేయవలెను

యోగాభ్యాసము రోజును నియమితసమయమున చేయవలెను. చాలకాలమువరకు అభ్యసించక కొంతకాలము అయినతరువాత యోగమును మానివేసిన యోగికి పూర్తిఫలితము కలుగదు. యోగమును ప్రతిదినమును నియమానుసారము ఆచరించకపోయినచో ఏకాగ్రవృత్తియొక్క సాతత్యము - అఖండత్వము సిద్ధించదు. ఫలము కలుగదు.

శంకరులు చెప్పిరి :-

నిమేషార్థం న తిష్ఠన్తి వృత్తిం బ్రహ్మమయీం వినా ।
యథా తిష్ఠన్తి బ్రహ్మాద్యాః సనకాద్యాః శుకాదయః ॥

"యోగులు అర్ధక్షణముకూడ బ్రహ్మాకారవృత్తిలేని స్థితియందుఉండరు. బ్రహ్మాదిదేవతలును, సనకాదిఋషులును, శుకాదిమునులును ఉదాహరణము. నిరంతరము, దీర్ఘకాలమువరకును యోగాభ్యాసము చేయుచున్నను సాధకుని చిత్తమునందు శ్రద్ధకలుగనిచో యోగఫలము లభించదు.

"స తు దీర్ఘకాలనైరన్తర్యసత్కారసేవితో దృఢభూమిః"

పతం॥ యోగ॥ సూ॥

"చాలకాలమువరకు, నిరంతరము శ్రద్ధగా సమాధిని అభ్యసించుటచే అది స్థిరపడును."

భగవానుడు గీతలో చెప్పెను :-

స్వర్గాదిలోకముల ఫలమును ప్రతిపాదించు శాస్త్రములను శ్రవణముచేయుటచే విక్షేపమును పొందిన నీబుద్ధి నిశ్చలత్వమును పొంది (అసంభావన, విపరీతభావన ఈ రెంటికిని అతీతమయి) సమాధియందు స్థిరముగా నుండును. అనగా అనుసంధానరాహిత్యము మొదలగు నవ యోగవిఘ్నములను అధిగమించును. అంతట నీవు యోగమును పొందగలవు. అనగా నీవు ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికము

లనెను దురకములగు దుఃఖములు పూర్ణనివృత్తిని పొందుట అను యోగమును పొందగలవు. నీకు జీవబ్రహ్మాభేదసాక్షాత్కారము కలుగును.

## సగుణనిర్గుణబ్రహ్మధ్యానము.

కాళా:— సగుణబ్రహ్మమును ధ్యానించవలెనా? నిర్గుణబ్రహ్మమును ధ్యానించవలెనా?

స్వా. ప్ర:— సగుణబ్రహ్మమును ధ్యానించుటచే బ్రహ్మాదిలోకములు లభించును. నిర్గుణబ్రహ్మధ్యానముచే బ్రహ్మసాక్షాత్కారము కలుగును.

కాళా:— నిర్గుణబ్రహ్మము మనస్సుయొక్క విషయము కాదు. ఆబ్రహ్మమును ధ్యానించుట ఎట్లు?

స్వా. ప్ర:— "సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ, ఆనన్దో బ్రహ్మ" అని బ్రహ్మలక్షణమును శ్రుతులు వర్ణించినవి. సత్యము అనగా మూడుకాలములయందును బాధించబడని తత్త్వము. జ్ఞానము అనగా ప్రకాశస్వరూపము. అనంతము అనగా వ్యాపకస్వరూపము. ఆనందము అనగా సుఖరూపము. ఇవి అన్నియును సామాన్యముగా బుద్ధిగోచరములే కదా!

కాళా:— అవునండి. ఇవి బుద్ధిగోచరములే.

స్వా. ప్ర:— ఇదేవిధముగా బ్రహ్మము సచ్చిదానందస్వరూపము అని ధ్యానించవలెను.

రామగీత చెప్పుచున్నది:—

యద్ బ్రహ్మ నిర్గుణం ప్రోక్తం ద్వివిధం తత్ప్రవక్ష్యతే,
సలక్షణమితి ధ్యేయం ధ్యేయాతీతమలక్షణమ్ ॥

"నిర్గుణబ్రహ్మము రెండురకములు. సచ్చిదానందరూపమున ధ్యానించబడునది సలక్షణము. ధ్యేయాతీతమగునది అలక్షణము."

కావున శాస్త్రములయందు సచ్చిదానందస్వరూపము అని చెప్పబడిన బ్రహ్మమును ధ్యానించవలెను.

## సరియగు అభ్యాసపద్ధతి.

పూర్వము జిజ్ఞాసువులు అనుభవముకల జ్ఞానివద్దకు వెళ్ళి ప్రశ్నించెడివారు. వక్తకు అనుభవము ఉండుటచేతను, శ్రోతయందు వైరాగ్యము ఉండుటచేతను శ్రోత ఏకాంతప్రదేశమునకు వెళ్ళి అభ్యసించి సిద్ధిని పొందెడివాడు. ఇప్పుడు ఎవరును ఇట్లు అభ్యసించుటలేదు. ఒకవేళ ఎవరైన అభ్యాసముచేసినను ఒకరోజు చేసిన పదిరోజులు మానివేయుదురు. ఇది అభ్యాసము అనిపించుకొనదు. అభ్యాసము ప్రతిదినమునియమితసమయమున చిరకాలముశ్రద్ధగానాచరించవలెను.

"ఆరమ్భశూరాః ఖలు భారతీయాః"

భారతీయులు ఆరంభశూరులు అని ప్రసిద్ధి. ఆరంభశూరులు మొదటపదిరోజులు బాగుగా ప్రయత్నించెదరు. తరువాత విసుగెత్తి అభ్యాసముపేరైనను ఎత్తరు. ఇట్టి సోమరులు వైరాగ్యమను ఖడ్గముచే రాగద్వేషాదిశత్రువులను పరిమార్చి మోక్షమను కోటను వశపరచుకొనలేరు.

## మోక్షమను కోటను జయించు పద్ధతి.

కామక్రోధాదిశత్రువులు మానవుని మోక్షపుకోటదగ్గరకు కూడ చేరనీయవు. కాని,

ఆరూఢస్య వివేకాశ్వం తీవ్రవైరాగ్యఖడ్గినః ।
తితిక్షావర్మయుక్తస్య ప్రతియోగీ న విద్యతే ॥

"వివేకము అను అశ్వముపై కూర్చొని, తీవ్రవైరాగ్యము అను ఖడ్గమును ధరించి, తితిక్ష (సర్వదుఃఖములను సహించుట) అను కవచమును ధరించినవానిని ఎవరును ఆపలేరు."

మామూలుగా మహాభారతమునందు యుద్ధకథవినువారు ఎంతో ఉత్సాహముతో శ్రవణముచేయుదురు. కాని కత్తులు ధళధళ

లాడుచు యోధులశిరములు మొండెములనుండి వేరయి భూమిమీద పడుచు, జనులరక్తము ప్రవహించుచు రణకోలాహలముతో కూడి యున్న యుద్ధమైదానములోనికి అట్టివారిని తీసికొనివెళ్ళి నిలబెట్టినచో ఆదృశ్యమును చూచి వారిహృదయము దడదడలాడును. వారు అచ్చటినుండి పారిపోవుదురు. ఇంక వారు చేతితోకత్తిపట్టి యుద్ధము ఎక్కడనుండి చేయుదురు?

ఉత్తరకుమారుని దృష్టాంతము ఇట్టిదే. కౌరవులు విరాటరాజు గోవులను తీసికొనిపోయిరి. వారిని ఎదిరించవలెనను ప్రసంగమున ఉత్తరకుమారుడు కౌరవులను ఓడించి ఆవులను వెనుకకు మరల్చు కొనివచ్చుట చాలసులభము అని గర్వోక్తులను విండురాజసభలో పలికెను. కాని కౌరవసైన్యమును చూచినంతనే ఆపరాక్రమము అణగిపోయి దానిస్థానమునకు పిరికితనము చేరుకొనెను. యుద్ధమైదా నమునుండి పారిపోవుటకు రథమును వెనుకకు త్రిప్పుమని బృహన్న లకు (అర్జునునకు) ఆదేశించెను. బృహన్నల రథమును మరల్చుటకు అంగీకరించలేదు. ధైర్యముగా రథముపై కూర్చొనమని చెప్పెను. ఉత్తరకుమారుడు క్రిందికి ఉరికి పరుగెత్తదొడగెను. బృహన్నల ఉత్త రుని పట్టుకొని రథమునకు కట్టివేసెను. అంతట ఏడ్చుచు ఉత్తరుడు బృహన్నలతో నిట్లనెను:—

"నేను చిత్రములలోమాత్రమే యుద్ధమును చూచితిని. యథార్థమగు యుద్ధము నాకు తెలియదు. నిజమైనయుద్ధమున మహా వీరులతో పోరాడవలెను. వారి ఆయుధముల దెబ్బలకు తట్టుకొన వలెను. వారిని జయించుటయును, జీవించుటయును చాలకష్టము అను సంగతి ఇప్పుడు నాకు తెలిసినది. ఈఆలోచన మొదటతట్టినచో ఇట్టి దుష్కరమగు కార్యము నిర్వహించుటకు సిద్ధపడెడివాడను కాను. ఇంటినుండి బైటికివచ్చుటకుకూడ సాహసించెడివాడను కాను."

ఇదేవిధముగ శాస్త్రాదులయందలి కథలలో వివేక వైరాగ్యములనుగురించి వినినంతనే వానియందు అభిలాషను పొందుదురు. కాని వివేక వైరాగ్యాదులద్వారా చిత్తవృత్తినిరోధమునకు ప్రయత్నించవలెనను సంగతి తెలిసినంతనే అది ఎంతదుష్కరమైనదో వారికి బోధపడును. చిత్తవృత్తిని స్థిరపరచుట ఏమియు అంతసామాన్యవిషయము కాదు. మనోనిగ్రహము శూరవీరులు చేయగలపని.

శ్రుతి చెప్పుచున్నది:—

*యది వీరో అనుహ్యాదగ్నిమిన్ధీత మర్త్యః।*
*ఆజుహద్ధవ్యమానుషక్ శర్మభక్షీత దైవమ్॥*

"వీరుడు ప్రభుప్రాప్తికొరకు ప్రబలమగు కోరిక అనుఅగ్నిని ప్రజ్వలింపజేయువలెను. నిత్యము కామక్రోధాదివృత్తులను అందు హోమము చేయవలెను. అప్పుడే ఆతడు దివ్యసుఖమును పొందును."

ఈలోకమునందు రాజ్యమును పొందుటకు ఎన్నిత్యాగములైనా చేయవలసివచ్చును. మృత్యుభయము మొదలగునవి కలిగియుండని సతతపురుషార్థశీలుడగువానికే నశ్వరమగు తుచ్ఛరాజ్యము చేజిక్కును. పిరికివాళ్ళను సామాన్యశత్రువులే దూరమునుండి నశింపుచేయుదురు. ఇటులనే వివేకము అను అశ్వముపై ఆరోహించి, వైరాగ్యము అను ఖడ్గమును చేతితో ధరించి, తితిక్ష అను కవచమును ధరించినవానిని ఓడించు సామర్థ్యము ఏశత్రువునకును లేదు ఆతనికి మోక్షము అను కోట తప్పక వశపడును.

శ్రీప్రకాశానందస్వామివారు ఇంకను ఇట్లు పలికిరి:— నేను ఏ శాస్త్రములను చదువలేదు. అనుభవముకూడ నాకు లేదు. అయినను స్వామివారు మాట్లాడకుండ మౌనముగానున్నారు. నేనుమాత్రమే మాట్లాడుచున్నాను.

*నిస్సారస్య పదార్థస్య ప్రాయేణాడమ్బరో మహాన్।*
*న సువర్ణే ధ్వనిస్తాదృక్ యాదృక్కాంస్యే ప్రజాయతే॥*

"సారములేని తుచ్ఛపదార్థమునకు ఆడంబరము ఎక్కువ ఉండును. బంగారమునుండి ధ్వనిరాదు. కంచునుండియే పెద్దధ్వని వచ్చునుకదా!"

నిత్యానందస్వామివారు శాస్త్రములను అభ్యసించి ఏకాంతమున కూర్చొని నిదిధ్యాసనముద్వారా ఆత్మసాక్షాత్కారమును పొందిరి. నేనుమాత్రము చదువుసంధ్యలేకుండ లపోడశంఖమువలె వాగుచున్నాను.

స్వా. ని. :—నాయందు పెద్దతనమును ఆరోపించి తమనుచిన్నవారినిగా చెప్పుకొనుచున్నారు. ఇట్టి శబ్దములద్వారా తమనుతక్కువవారినిగా ఋజువుచేసికొనుట నాకు నచ్చలేదు.

కాళ్లా:—లపోడశంఖము అనుమాట వింటిని. కాని దాని భావముమాత్రము తెలియదు.

స్వా. వి. :—ఒక బీదబ్రాహ్మణుడు ఉండెను. ఆతనికి ధర్మమునందు చాల భక్తిశ్రద్ధలు ఉండెను. ఆతని భార్యయును ఏకమాత్రుడగు పుత్రుడును చనిపోయిరి. ఆయన మహాత్ముడగు ఒక యోగిచెంతకు వెళ్లి చెప్పెను.

నేను యోగాభ్యాసము చేయదలచియున్నాను. కాని నాకు జీవితనిర్వహణమునకు వలయు సాధన సంపత్తి లేదు. నాజీవికకు కఠినపరిశ్రమయు యోగాభ్యాసమును రెండును ఎట్లు జరుగును? మహాత్ముడు దయాసముద్రుడు, ఆయన ఆబ్రాహ్మణునకు ఒక మంత్రమును ఇచ్చి చెప్పెను. "వెళ్ళుము, నీవు సముద్రపుఒడ్డున కూర్చొని పాలుమాత్రమే ఆహారముగా తీసికొనుచు 40 రోజులు ఈమంత్రమును జపముచేసినచో నీకు శరీరపోషణమునకు అవసరమగు పదార్థములు లభించును."

బ్రాహ్మణుడు సముద్రతీరమునకు వెళ్ళెను. యోగిఇచ్చినమంత్రమును పాలుమాత్రమే ఆహారముగా తీసికొనుచు శ్రద్ధగా జపించ

మొదలిడెను. నలుబదిరోజులు పూర్తిఅయిన తరువాత సముద్ర దేవుడు ప్రత్యక్షమయి అడిగెను:-

"నీకు ఏమి కావలెను?"

బ్రాహ్మ:—యోగాభ్యాసము చేయవలెనని నాకోరిక. కాని నాకు శరీరపోషణమునకు వలయు ఆధారము లేదు. అదిదయచేయుడు."

సముద్రుడు ఒక శంఖమును ఇచ్చి చెప్పెను:- ఈశంఖమును నీవు రోజుపూజించుము. ఇది రోజును నీకు అణాకాని యెత్తుబంగారము ఇచ్చును.

ఇట్లు చెప్పి సముద్రుడు అంతర్ధానము అయ్యెను.

బ్రాహ్మణుడు శంఖమును తీసికొని ఇంటికి బయలుదేరెను. త్రోవలో ఒక మోసగాడు కలిసెను. "స్వామీ! ఎక్కడనుండివచ్చుచున్నారు?" అని అతడు బ్రాహ్మణుని అడిగెను. బ్రాహ్మణుడు అమాయకుడు. అతడు పలికెను.

"ఒక మహాత్ముడగు యోగి ప్రసన్నుడయి ఒకమంత్రమును ఇచ్చెను. దానిని జపించుటచే సముద్రదేవుడు ప్రసన్నుడయ్యెను. ఆయన ప్రతిరోజున అణాకాణీయెత్తు బంగారమును ఇచ్చు శంఖమును ఇచ్చెను."

మోసగాడు దానిని కాజేయవలెనను తలంపుతో బ్రతిమాలెను.

స్వామీ! సాయంకాలము అయినది. చాల అలసిపోయిరి. ఈరాత్రి మాయింట విశ్రమించి రేపు ఉదయముననే నిశ్చింతగా ఇంటికి వెళ్ళుడు.

బ్రాహ్మణుడు ఆ అభిప్రాయమును అంగీకరించెను. అతని ఇంట సాయంకాలభోజనమును కావించి తన సంచీని చిలుకకొయ్యకు తగిలించి నిశ్చింతగా నిద్రించెను. మోసగాడు బ్రాహ్మణుడు గాఢనిద్రలోనున్న సంగతిని గ్రహించి ఆయన సంచిని తెరచి దేవతార్చన పెట్టెలోని శంఖమును సంగ్రహించెను.

తరువాతిరోజు ఉదయము ప్రాతఃకాలకృత్యములను నిర్వహించుకొని మోసగానిదగ్గర శెలవుతీసికొని ఇంటికి వచ్చెను. స్నానము చేసి దేవతార్చన పెట్టెను తెరచెను. అందు శంఖము కన్పించలేదు. అంతట బ్రాహ్మణుడు చాల దుఃఖముతో యోగిపుంగవునిదగ్గరకు వెళ్ళెను. తాను చేసిన జపము, అది సిద్ధిపొందుట, శంఖము దొంగిలింపబడుట– ఇవి అన్నియును ఆయనకు సవివరముగా విన్నవించెను. మహాత్మునకు అతని అమాయకత్వముపై దయకలిగి అతనికి మరియొక మంత్రమునిచ్చెను. ఆమంత్రమునకు యథాప్రకారము అనుష్ఠానము నిర్వహించినంతనే సముద్రదేవుడు ప్రత్యక్షుడయి అడిగెను:–

నేను నీకు కొలదదినములకుపూర్వము శంఖమును ఇచ్చితిని. మరల నీవు ఎందుకు వచ్చితివి?

బ్రాహ్మణుడు తనను మోసగాడు మోసగించిన వివరమును చెప్పెను.

సముద్రదేవుడు పలికెను:—ఇప్పుడు నేను నీకు ఒకశంఖమును ఇచ్చుచున్నాను. అది 1½ లక్షతులములు అంతకంటె ఎక్కువకూడ బంగారము ఇచ్చెదనని చెప్పును. కాని ఇవ్వదు. నీవు దొంగవద్దకు వెళ్ళి ఒకటింపావులక్షతులముల బంగారము ఇచ్చు శంఖమును తెచ్చితిని అని చెప్పుము. అతడు ఈశంఖమును తీసికొని నీశంఖమును ఇచ్చును.

బ్రాహ్మణుడు శంఖమును తీసికొని ఇంటికి బయలుదేరెను. దొంగ త్రోవలో కన్పడెను. బ్రాహ్మణుడు అతనికి క్రొత్త శంఖము సంగతి చెప్పెను. దొంగ శంఖమునందలి దురాశచే బ్రాహ్మణుని ఎంతయూ ప్రార్థించి తనఇంటికి తీసికొనిపోయెను. ఆయనకు ఫలహారాదులు సమర్పించి మిక్కిలి సేవచేసెను. బ్రాహ్మణుడు గాఢనిద్రను అభినయించెను. అంతట మోసగాడు బ్రాహ్మణునిసంచిలోనుండి శంఖమును తీసికొని వెనుక తాను అపహరించిన శంఖమును అందుంచెను.

రెండవరోజున బ్రాహ్మణుడు ఇంటికి బయలుదేరెను. దొంగ ఒకటింపావులక్షలతులముల బంగారము లభించునను ఆశతో త్వరత్వరగా స్నానాదిక్రియలను నిర్వహించి శంఖమును పూజించి పలికెను-

"శంఖమా! బంగారమును ఇమ్ము."

శంఖము చెప్పెను:—

ఇదిగో తీసికొనుము. ఒకటింపావు లక్షలతులముల బంగారము.

మోసగాడు:—ఇమ్ము! ఒకటింపావు లక్షతులముల బంగారమును ఇమ్ము!

శం:—ఒకటిన్నర లక్షతులముల బంగారము తీసికొనుము.

మో:—ఇమ్ము. ఒకటిన్నరలక్షతులముల బంగారము ఇమ్ము.

శం:--ఇదిగో, రెండులక్షలతులముల బంగారమును తీసికొనుము.

ఇట్లు దొంగ అడిగిన కొలదియు శంఖము అంతకంతకు ఎక్కువబంగారమును ఇచ్చెదనని చెప్పుచుండెను. చివరకు దొంగ విసుగెత్తి పలికెను.

"ఇచ్చుట లేదేమి?"

అంతట శంఖము పలికెను:—

*శఙ్ఖలీ కాఞ్చనం దద్యాత్ అహం శఙ్ఖలపోడకః।*
*వదామి బహువాక్యాని న దదామి కపర్దికామ్॥*

"ఆచిన్న శంఖము బంగారమును ఇచ్చును. నేను లపోడశంఖమును (పెద్దశంఖమును). కబుర్లు ఎన్ని అయినను చెప్పెదను, కాని ఏమియును ఇవ్వను."

ఇంతవరకు సంభాషణ జరిగినపిదప చాలరాత్రిఅయినందున అందరును నిద్రించుటకు వెళ్ళిపోయిరి.